పిల్లలను అంగన్‌వాడీ సెంటర్లలో చేర్చండి



గుంతకల్లు మండలం మల్లేపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



గుత్తి మండలం బేతాపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

గుంతకల్లు రూరల్: మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్‌వాడీ సెంటర్లలో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షాహీదా తల్లిదండ్రులకు సూచించారు. శుక్రవారం మండలంలోని మల్లేనిపల్లి గ్రామంలో అంగన్‌వాడీ పిలుస్తోంది రా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ పిల్లలతో కలసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్‌లో చదువు పూర్తి చేసుకుని ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలను గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బీ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు సుచరిత, అంగన్‌వాడీ టీచర్ గంగమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుత్తి: గుత్తి మున్సిపాలిటీ వ్యాప్తంగా ఉన్న అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం అంగన్‌వాడీ పిలుస్తోంది రా కార్యక్రమాలు నిర్వహించారు. సీడీపీఓ ఢిల్లీశ్వరి, సూపర్‌వైజర్ నాగేశ్వరి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మూడేళ్లు నిండిన పిల్లలను కేంద్రాల్లో చేర్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు నాగలక్ష్మి, సరస్వతి, గంగ, నసీమా తదితరులు పాల్గొన్నారు.

గుత్తి రూరల్: తల్లిదండ్రులు తమ చిన్నారులను అంగన్‌వాడీ ప్రీ స్కూల్‌లలో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రియాంక తెలిపారు. శుక్రవారం మండలంలోని బేతాపల్లి, మార్నేపల్లి, శ్రీపురం గ్రామాల్లో అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రీస్కూల్ పిల్లలు, తల్లిదండ్రులతో కలసి సూపర్‌వైజర్ ప్రియాంక ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ స్కూల్‌లో నేర్పిన విద్య ప్రాథమిక స్థాయిలోనే కాకుండా ఉన్నత స్థాయిలో విద్యా ప్రమాణాలు మెరుగుపడేందుకు తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మంజుల, లలిత పాల్గొన్నారు.



గుత్తి ఆర్ఎస్‌లో 'అంగన్‌వాడీ పిలుస్తోంది రా' కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

సమస్యల నడుమ ఆర్డీటీ కాలనీ

- ఇళ్ల మధ్య మురుగుతో ప్రజల ఇబ్బంది
- ప్రమాదకరంగా పైప్‌లైన్ పనులు

తాడిపత్రిటౌన్: పట్టణ సమీపంలోని ఆర్డీటీ కాలనీలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఇళ్ల మధ్య మురుగు నిలిచి ఉండటంతో బయటకు రాలేక పోతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. రాత్రి అయితే చాలు విషపురుగుల సంచారంతో భయం భయంగా గడుపుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గన్నెవారిపల్లి పంచాయతీలోని ఆర్డీటీ కాలనీలో దాదాపు 300 కుటుంబాలకు సంబంధించి 1,250 మంది నివాసముంటున్నారు. కాలనీ నుంచి వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేక పోవడంతో ఇళ్ల మధ్య మురుగు నిలిచి కాలనీ వాసులను అవస్థలకు గురి చేస్తోంది. వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా కాలనీ మురుగు నీటి కుంటను తలపిస్తోంది. ఏ వీధి చూసినా మురుగునీటిమయం కావడంతో రాత్రి అయితే చాలు విపరీతమైన దోమలు, విషపురుగులు సంచారంతో వణికిపోతున్నామని కాలనీ వాసులు వాపోతున్నారు.



ఆర్డీటీ కాలనీలోని ఓ వీధిలో నిలిచిన మురుగు



నీటితో నిండి ప్రమాదకరంగా పైప్‌లైన్ గుంత

దోమల కారణంగా కాలనీలో విష జ్వరాలు ప్రబలుతున్నాయన్నారు. కాలనీలో చాలా మంది అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారన్నారు. అలాగే కాలనీలో తాగునీటి పైప్‌లైన్ పనులు మధ్యలోనే ఆగిపోవడంతో.. పైప్‌లైన్ పనుల కోసం తీసిన గోతులు ప్రమాదకరంగా మారాయి. ప్రధాన రహదారి పక్కన పైప్‌లైన్ కోసం తీసిన కాలువ వర్షం నీటితో నిండిపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటోదనన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో వీధిలైట్లు అంతంత మాత్రంగానే ఉన్నాయని, రాత్రి సమయంలో చిన్న పిల్లలు నీటి గుంతల్లో పడితే ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీ నుంచి మురుగునీరు బయటకు వెళ్లేదుకు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు

శింగనమల: మండలంలోని 39 ప్రాథమిక, 3 ప్రాథమికోన్నత, 10 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, ఎంజేపీ బీసీ గురుకుల బాలికల పాఠశాలలకు పాఠ్య పుస్తకాలను సరఫరా చేసినట్లు ఎంఈఓ నరసింహరాజు తెలిపారు. శుక్రవారం ఎమ్మార్సీ నుంచి ఆటోలు, వ్యానుల ద్వారా పుస్తకాలను పంపించారు. ఎంఈఓ మాట్లాడుతూ పాఠ్య పుస్తకాలు 25,595, స్కూల్ బ్యాగులు 3478, యూనిఫాం 3478, బెల్టులు 2309, నోటు పుస్తకాలు 20,842, షూస్ 3,483 జతలు, బొమ్మల నిఘంటువులు 268, ఆక్స్‌ఫర్డ్ నిఘంటువులు 399 వచ్చాయన్నారు. వాటిని ఆయా పాఠశాలలకు సరఫరా చేస్తున్నామన్నారు. పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 శివప్రసాద్, ఎమ్మార్సీ సిబ్బంది, సీఎంఆర్‌టీలు, పీటీఐలు, ఐఈఆర్ఎస్ సిబ్బంది, పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.



పాఠ్య పుస్తకాలను వ్యాను ద్వారా పాఠశాలలకు తరలిస్తున్న దృశ్యం

శాంతియుతంగా జీవించండి

పెద్దపప్పూరు: ప్రతి ఒక్కరూ శాంతియుతంగా జీవించండి. ఆధిపత్యం కోసం నేరాలకు పాల్పడడం వల్ల మీ జీవితాలతోపాటు పిల్లల భవిష్యత్తుకు ముప్పువాటిల్లుతుందని ఇన్‌చార్జి ఎస్‌ఐ గౌస్‌బాషా సూచించారు. శుక్రవారం ఆయన సమస్యాత్మక గ్రామాలైన చాగల్లు, ధర్మాపురంలో గ్రామసభ నిర్వహించి నేరాలకు పాల్పడడం వల్ల జరిగే అనర్థాలను గ్రామస్తులకు వివరించారు. ఎటువంటి చిన్నపాటి సమస్య ఉన్నా సొంత నిర్ణయం తీసుకోకుండా పోలీసులకు సమాచారం అందిస్తే పరిష్కరిస్తారన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎస్‌ఐ గౌస్‌బాషా

'కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి'

తాడిపత్రి అర్బన్: ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి నడుపుతున్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలపై విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఏబీవీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల్ల సమావేశంలో పట్టణ కార్యదర్శి హరినారాయణ మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు నిబంధనలను అతిక్రమిస్తున్నా విద్యాశాఖాధికారి చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. పట్టణంలోని ప్రైవేటు విద్యాసంస్థల్లో రూ.వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. పుస్తకాలను కూడా పాఠశాలలోనే విక్రయిస్తూ ముందస్తు ఫీజుల పేరుతో విద్యను వ్యాపారంగా మార్చారని మండపడ్డారు. ఎంఈఓ స్పందించి అటువంటి విద్యాసంస్థలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు రాజు, మనోజ్, భాను తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

గార్లదిన్నె: మండలంలోని యర్రగుంట్లలో శుక్రవారం పేకాట స్థావరంపై పోలీసులు దాడులు చేసి ఐదుగురిని అరెస్టు చేశారు. ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ మాట్లాడుతూ గ్రామంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలసి దాడులు చేశామన్నారు. ఈ సందర్భంగా ఐదుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.7,500 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

కాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో కాలభైరవ స్వామి

పామిడి: పట్టణంలోని భోగేశ్వరాలయంలో శుక్రవారం కాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. జేష్టమాసం శుక్ల అష్టమిని పురస్కరించుకుని స్వామిని శోభాయానంగా అలంకరించారు. అర్చకులు రామశర్మ, చంద్రాశర్మ, అనిల్ తదితరులు స్వామికి పూజలు చేశారు. భక్తులు మూలవిరాట్‌ను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

వసతి గృహ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

పెద్దపప్పూరు: మండలకేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహ ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని వార్డన్ వెంకటేశ్వర్లు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వసతి గృహంలో చేరదలుచుకున్న విద్యార్థులు ఇప్పటి వరకూ 5వ తరగతి చదివిన పాఠశాలలో టీసీ తీసుకుని మండలకేంద్రంలోని జిల్లా పరిషత్తు పాఠశాలలో అడ్మిషన్ కావాలన్నారు. అనంతరం వసతి గృహ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



గర్భిణులకు సూచనలిస్తున్న డాక్టర్ స్వాతి లక్ష్మి

బుక్కరాయసముద్రం: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని మండల డాక్టర్ స్వాతి లక్ష్మి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్లినిక్ డే సందర్భంగా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు వ్యక్తిగత ఆరోగ్య పరిశుభ్రతతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ప్రతి నెలా డాక్టర్ సూచనల మేరకు చెకప్ చేయించుకోవాలన్నారు. అనంతరం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ మోహన్‌రావు, పీహెచ్ఎన్ చెన్నమ్మ, నాగలక్ష్మమ్మ, సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, మిడ్‌లెవల్ ప్రొవైడర్స్ జ్యోతి, గౌతమి, జయంతి కీర్తి, మంజు భార్గవి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'కరెంటు సమస్యలు అధిగమిస్తున్నాం'

పామిడి: పట్టణంలో కరెంటు సమస్యలను ఎప్పటికప్పుడు అధిగమిస్తున్నామని ఏపీఎస్పీడీసీఎల్ ఏఈ మధుసూదన్‌రావు శుక్రవారం తెలిపారు. ఇటీవల ఈదురు గాలులతో కూడిన వర్షాల వల్ల విద్యుత్ స్తంభాలు నేలకొరగడం, చెట్లు పడి తీగలు తెగిపోవడం వంటి పలు సమస్యల వల్ల కరెంట్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందన్నారు. దీనికితోడు సామర్థ్యానికి మించిన ట్రాన్స్‌ఫార్మర్ లేక పోవడంతో విద్యుత్ అంతరాయం కలిగిందన్నారు. వీటినన్నింటిని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, సామర్థ్యం పెంపుగల ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుతో విద్యుత్ సమస్యను ఓ కొలిక్కి తెచ్చామన్నారు. సిబ్బందిని అందుబాటులో ఉంచి విద్యుత్ సమస్యలను తక్షణం పరిష్కరిస్తున్నామన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

పుట్లూరు: మండలంలోని కడవకల్లు గ్రామంలో గురువారం రాత్రి జయలలిత అనే మహిళను దుర్భాషలాడిన చిన్న సిద్దయ్య అనే వ్యక్తిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ హేమాద్రి తెలిపారు. అసభ్యంగా ప్రవర్తిస్తూ దుర్భాషలాడినట్లు బాధిత మహిళ ఫిర్యాదు చేసిందన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు.

భూసారం పెంపుతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న డీడీఏ మద్దిలేటి

శింగనమల: రైతులు పొలాల్లో భూసారం పెంచుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని డీడీఏ మద్దిలేటి అన్నారు. శుక్రవారం శింగనమలలోని రైతు భరోసా కేంద్రంలో రైతులకు ఖరీఫ్ పంటల సాగుపై ఆయనతోపాటు ఏడీఏ శైలజ, కేవీకే శాస్త్రవేత్త కిశోర్‌రెడ్డి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీడీఏ మాట్లాడుతూ నేల ఆరోగ్యం క్షీణించి, భూముల్లో సేంద్రియ కర్బనం అత్యల్ప స్థాయికి పడిపోయిందన్నారు. దీనిని తిరిగి పొంపెందించుకోవల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అందులో భాగంగా పశువుల పేడ వాడాలన్నారు. పచ్చి రొట్ట ఎరువులు అయిన జీలుగ, జనుము, పిల్లి పెసర, మినుము సాగు చేసి భూమిలో కలియదున్నాలన్నారు. జిప్సం వాడకం వల్ల కూడా నేలలో ఉదజని మెరుగుపడుతుందన్నారు. ఏడీఏ మాట్లాడుతూ భూమిలోకి వర్షం నీరు ఇంకేలా వాలుకు అడ్డంగా దున్నుకోవాలన్నారు. రైతులు సాగు చేసే పంట విత్తనాలను విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. స్ప్రింట్ 3 గ్రాములు ఒక కేజీ వేరుశనగ విత్తనాన్ని కలిపి శుద్ధి చేసుకోవాలన్నారు. ట్రైకోడర్మ విరిడి ఒక కేజీ విత్తనానికి 8 గ్రాములు కలిపి శుద్ధి చేసుకోవాలన్నారు. దీనివలన వేరుకుళ్లు తెగులును నివారించవచ్చునన్నారు. ఒక ఎకరాకు 2 కేజీల ట్రైకోడర్మ విరిడిని 90 కేజీల పేడ, 10 కేజీల వేప పిండితో కలుపుకొని 2 వారాలు పాటు గోనె సంచులు కప్పి నిల్వ ఉంచి, తరువాత భూమిలో కలియదున్నాలన్నారు. ఇలా చేయడం వలన వేరుకుళ్లు తెగులు నివారించవచ్చునన్నారు. వర్షం పడినప్పుడు వేరుశనగ విత్తిన 30 రోజులు లేదా 50 రోజుల తరువాత ట్రైకోడర్మని భూమిలో పైపాటుగా వేసుకోవచ్చునన్నారు. వేరుశనగ చుట్టూ జొన్నని రక్షక పంటగా నాలుగు వరుసలు వేసుకోవాలని, దీనివలన చీడపీడల ఉధృతిని అరికట్టవచ్చునన్నారు. రెడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త కిశోర్‌రెడ్డి మాట్లాడుతూ కందిలో విత్తన శుద్ధి క్లోర్‌పెర్రిఫాస్‌తో చేసుకోవడం వలన పంటను 30 రోజుల వరకు రక్షించుకోవచ్చన్నారు. ఆముదం పంట రకాలు అయిన ఐసీహెచ్ -5, ఐసీహెచ్-66 కేవీకేలో అందుబాటులో ఉన్నాయన్నారు. సాగు చేయదలచిన రైతులు కేవీకే రెడ్డిపల్లిలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అన్వేష్‌కుమార్, ఏఈఓ అక్కమ్మ, ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ రక్తదాతల దినోత్సవం

గుంతకల్లు: స్థానిక ప్రభుత్వాస్పత్రిలోని బ్లడ్ బ్యాంకులో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ప్రభుత్వాస్పత్రి పర్యవేక్షకుడు డాక్టర్ జయవర్ధన్‌రెడ్డి, పోలేరమ్మ ఆలయ కమిటీ ధర్మకర్త, భవన నిర్మాణ కార్మిక సంఘం మాజీ అధ్యక్షుడు మేస్త్రీ దొడ్డప్ప ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసే ప్రతి ఒక్కరూ ప్రాణదాతలేనన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జేవీవీ వ్యవస్థాపక అధ్యక్షుడు వి.గంగరాజు, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ హరిప్రసాద్‌యాదవ్, ప్రభుత్వ ఆస్పత్రి ఏఓ ప్రజ్ఞ, భారత రాజ్యాంగ అవగాహన వేదిక అధ్యక్ష, కార్యదర్శులు టీచర్ చంద్రోఖర్, జింకల సరస్వతి తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

రక్తదానం చేయండి.. మానవత్వం చాటండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ ఖాజీ రజాక్‌పీర్ సాహెబ్

గుంతకల్లుటౌన్: తల్లి జన్మనిస్తే రక్తదాత పునర్జన్మను ప్రసాదిస్తాడు. రక్తదానం చేసి ప్రాణాదాతలుగా జీవించాలని ముస్లింల పట్టణ ప్రభుత్వ ఖాజీ సయ్యద్ రజాక్‌పీర్ సాహెబ్ సూచించారు. శుక్రవారం భాగ్యనగర్‌లోని మదరసాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బక్రీద్ పండుగను పురస్కరించుకుని ఈ నెల 17న రెడ్‌డ్రాప్ రక్తదాతల సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న మెగా రక్తదాన శిబిరాలకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ బక్రీద్ రోజు సామూహిక ప్రార్థనల అనంతరం ఎస్‌జేపీ హైస్కూల్ వద్దనున్న షాదీఖానా, ఎఫ్‌సీఐ ఎదురుగా ఉన్న ఈద్గా, పాత గుంతకల్లు మస్తానయ్య దర్గా ఆవరణలోని ఈద్గా మైదానాల్లో ఏర్పాటు చేయనున్న రక్తదాన శిబిరాల్లో ముస్లిలు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలన్నారు. కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ మన్సూర్ అలీ సాహెబ్, రెడ్‌డ్రాప్ వ్యవస్థాపకుడు రెహమాన్, పట్టణ అధ్యక్షుడు గులామ్ మహమ్మద్, కార్యదర్శి షఫీ, ఉపాధ్యక్షుడు దివాకర్, జేవీవీ కార్యదర్శి ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎంలకు భద్రత కరువు



పాత మున్సిపాలిటీ కార్యాలయం ఎదురుగా ఉన్న బ్యాంక్ ఆఫ్ బరోడా ఏటీఎం



షాదీఖానా ఎదురుగా ఉన్న స్టేట్ బ్యాంకు ఏటీఎం

తాడిపత్రిరూరల్: పట్టణంలోని వివిధ బ్యాంకుల ఏటీఎంలకు భద్రత కరువవుతోంది. గతంలో పలు ఏటీఎంల్లో దొంగలు పడి మిషన్లను పగులకొట్టి నగదును దొంగలించే ప్రయత్నం చేశారు. అయినా వాటి రక్షణ కోసం సెక్యూరిటీ గార్డులను బ్యాంకు అధికారులు ఏర్పాటు చేయలేదు. ఏటీఎంల ప్రారంభంలో వాటి వద్ద సెక్యూరిటీ గార్డులను భద్రత కోసం ఉపయోగించే వారు. వివిధ కారణాలతో వారిని తొలగించారు. దీంతో ఏటీఎంలకు భద్రత కరువైంది. గతంలో ఏటీఎం మిషన్లను పగులకొట్టి డబ్బును తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తూ విఫలయ్యేవారు. ప్రస్తుతం ఏటీఎం మిషన్లను ఎత్తుకెళ్లి మరీ డబ్బును దోచుకుంటున్నారు. వారం రోజుల క్రితం దొంగలు కూడేరులో ఏటీఎంను ఎత్తుకెళ్లారు. ఇలాంటి సంఘటనలు తాడిపత్రిలో జరగకుండా అధికారులు జాగ్రత్త పడి ఏటీఎంల వద్ద సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.



రిజిస్ట్రార్ కార్యాలయ సమీపంలో ఉన్న కెనరా బ్యాంకు ఏటీఎం

క్లుప్తంగా

రేపు టౌన్ బ్యాంకు సర్వసభ్య సమావేశం

గుత్తి: పట్టణంలోని ఆర్ఎస్ రోడ్డులో ఉన్న వసుధ ఫంక్షన్ హాల్లో ఆదివారం టౌన్ బ్యాంకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు బ్యాంకు ఈసీఓ మహేశ్వర ప్రసాద్, చైర్మన్ అబ్దుల్ జిలాన్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 11 గంటలకు సర్వ సభ్య సమావేశం ప్రారంభమవుతుందన్నారు. బ్యాంకు అధికారులు, సిబ్బంది, ఖాతాదారులు తప్పకుండా హాజరు కావాలని వారు కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

బుక్కరాయసముద్రం: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొర్రపాడు పీహెచ్‌సీ డాక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. శుక్రవారం మండలంలోని కొర్రపాడు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో డెంగీ, మలేరియా మాసోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరి శుభ్రతతో పాటు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రోజూ పౌష్టికాహారం తీసు కోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ మోహన్‌బాబు, కేశవయ్య, రాజేంద్ర ప్రసాద్, రమేష్, కవిత, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు పునరుద్ధరణపై హర్షం

పుట్లూరు: జిల్లా కేంద్రం అనంతపురం నుంచి మండలంలోని ఎల్లుట్ల, జంగంరెడ్డిపేట గ్రామాలకు ఆర్టీసీ బస్సు పునరుద్ధరించడంపై ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వారు మాట్లాడుతూ 18 ఏళ్ల క్రితం బస్సు సర్వీసును అధికారులు నిలిపివేశారన్నారు. అప్పటి నుంచి నార్పలతో పాటు అనంతపురం జిల్లా కేంద్రానికి ఆటోల్లో వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రస్తుతం ఎల్లుట్ల, జంగంరెడ్డిపేట తదితర పల్లెలకు ఆర్టీసీ బస్సును ఉదయం, సాయంత్రం రెండు సార్లు నడుపుతుండటంపై ప్రజలు ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రిన్సిపాల్‌కు సన్మానం



లక్ష్మయ్యను సన్మానిస్తున్న విద్యార్థులు

గుంతకల్లు: స్థానిక ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్యను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కళాశాల అధ్యాపకుడిగా పనిచేసిన లక్ష్మయ్యకు ప్రిన్సిపాల్‌గా పదోన్నతి లభించడంతో కళాశాలకు చెందిన 1998-2001 బ్యాచ్ డిగ్రీ విద్యార్థులు కె.ఎ క్రిస్వామి, ప్రకాష్, ప్రతాప్, ఆది, నారాయణ, బాషా, రామాంజీ తదితరులు ఆయన్ను పూలమాలలు, శాలవతో ఘనంగా సత్కరించారు. కళాశాల అభివృద్ధికి లక్ష్మయ్య చేసిన సేవలు, విద్యార్థుల ఎదుగుదలకు చూపిన మార్గాలను గుర్తు చేసుకున్నారు. త్వరలోనే పూర్వ విద్యార్థులు సమ్మేళనం ఏర్పాట్లు చేస్తామని వారు వివరించారు.

దుకాణాల్లో 'రెస్క్యూ'



పిల్లల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న రెస్క్యూ టీం సభ్యులు

గుత్తి: పట్టణంలో శుక్రవారం జిల్లా రెస్క్యూ టీం సభ్యులు కిరాణా షాపులు, బట్టల దుకాణాలు, మెకానిక్ షాపుల్లో రెస్క్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గురు మైనర్ పిల్లలను అదుపులోకి తీసుకున్నారు. వారిని అనంతపురం చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు వీడియా కాల్ ద్వారా హాజరు పరిచారు. అనంతరం పిల్లల తల్లిదండ్రులు, షాపుల యజమానులకు రెస్క్యూ టీం సభ్యులు వెంకటేశ్వరి, సుజాత, రవీంద్ర, ప్రతాప్ నాయుడు, జయమ్మ, సురేఖ కౌన్సిలింగ్ ఇచ్చారు. పిల్లలను పనికి పంపకుండా బడికి పంపాలని సూచించారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

గుత్తి: గుత్తి, గుత్తి మున్సిపాలిటీ, పెద్దవడుగూరు మండలాల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీఎస్పీడీసీఎల్ ఏడీఈ సాయి శంకర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 220 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు, మెయింటనెన్స్ పనుల దృష్ట్యా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ కరెంట్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.